"అనూరాధ"

శ్రీ 'విజయ - రాఘవ'

రాంచరణ్ యిప్పటికి మేనత్త యింట్లోంచి లేచొచ్చేసి అయిదార్నెల్లు కావస్తోంది. అతను లేవడానికి కారణం, అతనికే తెలియలేదు లేచేంతవరకు. తన తల్లిదండ్రులు చనిపోయిననాటినుంచి ప్రేమతో పెంచింది మేనత్త ఉదయిని. ఆ పెంచడంలోగల మార్దవం రక్తసంబంధమైన నాన్నకు సయాన చెల్లెలు కాబట్టి. యీనాటివరకు ఉదయిని పెంపకాన్ని గుర్తుకు తెచ్చుకుంటే "అమ్మా-నాన్న వుంటే యింకేలాగు పెంచేవారో" అనిపిస్తూండేది.

ఏవిషయంలోనూకూడా రాంచరణ్‌ని పల్లెత్తు మాటని యెరుగదు ఉదయిని. అనవసరంగా ఒకళ్ళ మనస్సుని కష్టపెట్టే తత్వం కాదామెది. ఇప్పటికీ రాంచరణ్ ఎంత వేరుగా వున్నప్పటికీ, ఉదయిని రోజుకొక తూరైనా ఆ కాళీబజారుగుండావచ్చి, చటర్జీగారింటిముందు నిలబడి-

"రాంచరణ్ వున్నాడా?" అని అడక్కుండా కాపలావాణ్ణి వెళ్లేదికాదు. వీలైతే చూసివెళ్లేది కూడాను. అటువంటప్పుడు రాంచరణ్‌కి మమకారం పెల్లుబికి మాట్లాడాలనిపించేది, ఉదయిని తన్ను గురించి ప్రత్యేకంగా క్షేమసమాచారాలు తెలుసుకొంటున్నప్పుడల్లా.

రాంచరణ్ మేనత్త యింట్లోంచి వచ్చేనాడే- ఉదయిని-

"చరణ్! నేనున్నానుగా, యింత కాలంబట్టి నిన్ను పెంచి, చదువు సంధ్యలు చెప్పించాను. మీ అమ్మ నిన్ను పెంచమని, కళ్లార చూసుకోమని చెప్పి చేతిలో చేయ్యుంచి కండ్లు మూసింది. యింత వరకు నీకేవిధంగానూ కష్టంకలుగచేయలేదు. త్రిపాఠీ మామయ్య యేదో గొణుక్కున్నంత మాత్రాన యింత యిదిగా నామీద సీతకన్ను వేసి, నీ వొక్కడవే యీ విధంగా వుండటం బాగుండలేదు" అని కళ్ల నీళ్ల పర్యంతంగా అంటుంటే జేబురుమాల్‌తో వచ్చే దుఃఖాన్ని ఆపుకొంటూ-

"వస్తానత్తయ్యా" - అని రాంచరణ్ సింహద్వారం గుమ్మందాటి వస్తుంటే మొక్కలకు నీళ్లు పోస్తున్న 'అనూరాధ' నిశ్చేష్టతరాలై, మొగం మీద గాలికి చెదిరిన ముంగురులుని తడిచేత్తో పైకి తీసికొంటూ,

"ఎక్కడికి బావా!" అంది.

రాంచరణ్ జవాబివ్వడానికి సిద్ధంగాలేడు' ఏమని యిచ్చినా, దానికి ప్రయోజనం, ఘనత' గారవం వుండవని తెలుసు. హఠాత్తుగా యీ విధంగా బావ బయలుదేరి వెళ్ళిపోవటం వింతగా కనిపించింది అనూరాధకు.

వెళ్లిపోయేబావవెనక, వుదయిని అనేమాటలు వింటుంటే సంగతి గ్రహించి కళ్లవెంట నీళ్లు తిరిగినయి. ఉదయిని దగ్గరగావచ్చి మెల్లిగా భుజంమీద అనుకొంది. రాంచరణ్ పెద్దవీధిలోకి వచ్చేసెయ్యడం కని

పించింది. కాని యెక్కడకు వెడతాడో వూహించ లేకపోయారు.

అనూరాధ వుత్తరాలుచదివి అర్థంచేసుకొని జవాబు వ్రాయడానికి, పుస్తకాలుచదివి వుల్లాసాన్ని, వుత్సాహాన్ని పొందడానికి పనికివచ్చే చదువు మాత్రం నేర్చుకొంది. త్రిపాఠీ - ఉదయినుల యేకైక రాజుపట్టి అనూరాధ. త్రిపాఠీకి మొగపిల్లలు లేకపోవటంచేత యేమీ బాధపడేరకంగాదు. కాని ఉదయిని చాలా వేదనపడేమనిషి. రాంచరణ్ యెలాగో ఉదయిని యింట్లోవుండి చదువుకొంటూన్నాడు. రాంచరణ్ కి ఉదయినిమాటలంటే మాత్రం చాలా లక్ష్యం. ఇక ఎవరిమాటకు అంత శ్రద్ధ చూపేవాడుకాదు. అనూరాధ ఒకటి రెండు సంవత్సరాలు వయస్సులో చిన్న. రాంచరణ్ బుద్ధి తెలిసిన దగ్గరనుండీ ఉదయినిచేతిలో పెరగటంవల్ల అనూరాధ తనకు మరదలవుతుందని తెలియదు. తనతో పెరుగుతున్న 'అనూరాధ'ను చెల్లెలుగా భావించి రోజులు గడిపేవాడు.

పగలల్లా పుస్తకాలు చదవడం, రాత్రిళ్లు పొద్దుపోయేంతవరకు వ్రాసుకుంటూ కూర్చునేవాడు. ఉదయినికి ఏంవ్రాస్తున్నాడో, ఏంచదువుతున్నాడో తెలుసుకోవాలని యిచ్ఛవుండేదికాదు. ఏనాడూ ఆమె మాట వరుసకైనా, 'అనూరాధ' నీకు మరదలవుతుందనికూడా అనలేదు. తనకు బాగా ప్రపంచమంటే అర్థమయి, నాల్గుకథలు ఆ, ఆ పత్రికల్లో ప్రచురణయ్యేటప్పటికి, యేవో అనుభూతులు మధురంగావుండే పరిస్థితులలో 'అనూరాధ' తనకు మరదలని గ్రహించుకోగలిగాడు. యీ విషయం తెలుసుకోడానికి కారణం ఒకటుంది.

"పొద్దుపోయేదాకా వ్రాసుకొంటున్న ఒకనాటి రాత్రి సమయం" త్రిపాఠీ - ఉదయినుల సంభాషణ విన్నంతసేపువిని, చివరకు తేలిన విషయం 'అనురాధ' తనకు చెల్లెలుకాదని, ఆమెను తనకిచ్చి వివాహం చేద్దామని ఉదయిని అనడం, త్రిపాఠీ ఆ ప్రసంగాన్ని ఆమోదించకపోవడం, వ్రాస్తున్న ఆ నాటి రాత్రి తెలుసుకున్నాడు. అనేక పర్యాయములు ఉదయిని త్రిపాఠీకి చెప్పిచూసింది. కాని అతని మాటల్లో ప్రతిధ్వనించేవి, ప్రస్ఫుటించేవి - యివే-

"తల్లిదండ్రులను పోగొట్టుకున్నవాడు, చదువు తక్కువవాడు, ఆస్థికూడా చెప్పుకోతగినంతలేదు. మనింట్లో యింత కాలంబట్టి వుంటూవున్నవానికి యివ్వడం నాకేమి యిష్టంగాలేద"ని స్పష్టపరిచాడు.

యీ మాటలువినే రాంచరణ్ ఆపుకోలేని దుఃఖంతో, ఆవేదనా హృదయంతో ఆ యింట్లో వుండకుండా లేచొచ్చేడు.

ఇప్పుడు రాంచరణ్ యువకప్రాయం బాగా వున్నవాడు. వారాలు చేసుకొని బ్రతికి యెలాగో మిత్రుల ధనసహాయంతో బి. ఏ. పూర్తి చేసాడు. అనూరాధ కనిపించినా అప్పుడప్పుడు పల్కరించాలని పెదిమలవరకు మాటలొచ్చేవి. కాని బయటకు రానివ్వడానికి యిష్టముండేదికాదు.

ఉదయిని యింటివద్దవుండి కథలు వ్రాసేరోజుల్లో-పిచ్చాపాటీకోసం అనురాధ వస్తూండేది.

"చరణ్ బావా! ఆ కథ అలా వ్రాసావ్ గదా! యేమిటి అర్థం" అని అడుగుతూండేది. టూకీగా చెప్పితే సరిపోతుందనుకుంటే, దాన్ని అనుకొని పరిస్థితులలో విస్పృతం చేయాల్సొస్తూండేది. 'బావ' అనేపదంలో అర్థం తెలుసుకున్న తరువాతకూడా అనూరాధ అప్పుడప్పుడు తప్పటడుగులు వేస్తూండేది. ప్రక్కకొచ్చి చరణ్ భుజంమీద ఆనుకొని, అతనితోబాటు తనుకూడా పుస్తకంలోకి చూస్తూన్న సమయంలో చరణ్ చాలా తెలివిగా మందలించేవాడు. అనూరాధ నాలిక కొరుక్కుని సిగ్గు తోడిగేది. కాని ఆ సిగ్గు దొంతరలు ఆమె ముఖంలో ఆట్టేకాలం నిలవకపోవడానికి ఎంతోక్కాలం పట్టేదిగాదు. నెమ్మదిగా - "బావా! నిన్ను తాకితే తప్పా?" అని అమాయికంగా ప్రశ్నించేది. చరణ్ దానికి సమాధానం చిరునవ్వుతోనే. అనూరాధకు ఆ

చిరునవ్వులోని అర్థం, అర్థంకాక "తప్పేనేమో" అనుకునేది. బావను తాకుతూ నిల్చుండటం ఆమె చేయాలని చేయడంకాదని మనస్సులో అనుకొంటూం డేది. దీనికి రాంచరణ్ గట్టిగా ఒక్కసారైనా చెప్పినట్లైతే యింతగా ప్రవర్తించేదికాదేమో !

అయిదార్నెల్లయినా రాంచరణ్ మళ్లా తనింటికి వచ్చి వుండకపోయేటప్పటికి అనూరాధకు అదోలాగ వుండిపోతోంది. ఒకనాడు - వుదయిన్ని -

"అమ్మా ! చరణ్ బావ మనింటికిరాడా ? " అని అడిగింది.

ఆ ప్రశ్నకు జవాబు యెలా యివ్వడమో తెలియ లేదు ఉదయినికి.

చివరకు అనూరాధే ఒకనాడు అన్నాల దగ్గర తన వివాహ విషయంలో అమ్మా - నాన్న మాట్లాడు కునే మాటలు విన్నతరువాత తన సందేహ నివృత్తి చేసుకుంది. ఒకవేళ తానే స్వయంగా బావ దగ్గరకు వెళ్ళి నచ్చచెప్పితే వినడా? బ్రతిమాలితేకూడా ఒప్పుకోడా? అని పదేపదే తలబోసుకునేది. ఇది వరకటి మాదిరిగా బావ తనతో యిప్పుడు మాట్లా డటం లేదాయె! ఎలా అతనితో యీ విషయా లన్నీ మాట్లాడాలి.

రాంచరణ్ గదిలో ఒకరోజు ఒంటిరిగా కూర్చొని వ్రాసుకొంటున్నాడు యేదో. గది తలుపులు మూసి వున్నాయి. కిటికీ తలుపులు మాత్రం పైభాగంలో తెరువబడి వున్నాయి. కొద్దిపాటిగాలి వీస్తోంది. వెన్నెల రాత్రిలో చటర్జీగారి పూలతోటలోని వాస నలు గుమ్మని గదిలో జొరబడుతున్నయి.

'రాత్రంతా పోయేవరకు యేంచేస్తున్నావ్ చరణ్' అని చటర్జీగారడిగేంతవరకు తలెత్తకుండా వ్రాతపని చేయడం అలవాటయిపోయింది.

'బావా' అంటూ మెల్లగా పిలిచిన కంఠస్వరా నికి_

'ఎవరూ' అనే ప్రశ్నతో కుర్చీలోంచి లేచి తలుపు తెరచాడు చరణ్.

కళ్లు మసకలు కమ్మాయి అనుకోని పరిస్థితుల్లో 'అనూరాధ' ఆ గమనానికి.

ఇంతకాలంబట్టి తన నివాస కార్యక్రమంలో రాత్రిపూట 'అనూరాధ' రావటం యిదే మొదట సారి. అర్థంకాని ఆశ్చర్యం ఆవరించింది.

'లోపలికి రమ్మ'ని తాను ముందు నడిచాడు. టేబిల్ దగ్గరకొచ్చి నిలబడింది అనూరాధ.

చరణ్ కుర్చీలో కూర్చొని, సిగరెట్ ముట్టిం చాడు.

'బావా !'

తలెత్తి చూసాడు.

అనూరాధ నిలబడేవుంది.

'కూర్చోరాదూ ! అనూ !'

చొక్కాగాని, బనీనుగాని తొడుక్కోకుండా ఒక్క పైజామాతోవున్న చరణ్‌ని ఒక్కసారి కళ్ళు పెద్దవిచేసి అవలోకించింది. ఎండిన ఆ గుండెను యింకా ప్రేమిస్తున్న ఆ సిగరెట్లనుచూస్తూ -

'బావా ! సిగరెట్లు కాల్చకు, గుండెచూడు యెలా యెండిపోతోందో' అంది అనూరాధ జాలిగా.

ఒక్క చిరునవ్వునవ్వి - అదైనా పెదిమల సరి హద్దులు దాటనివ్వకుండా-

"అనూ ! అనేక రకాలైన ఆవేదనలు, బాధలు యీ సిగరెట్లకన్న యెక్కువగా గుండెను పీల్చె య్యవూ! తాళలేని వ్యధలలో, కాస్తో, కూస్తో వుత్సా హాన్ని కలిగించగలిగేవి యివే. ఎవరిచేత ఆద రించబడకపోయినా వీటిచేత మాత్రం ఆదరించబడు తున్నా" అని ఆఖరిసారి గట్టిగాపీల్చి పారవేశాడు.

అనూరాధకు సమాధానం తెలియలేదు సరిగదా ఆశ్చర్యం కలిగించింది. తనవంక చూస్తున్న చూపులో

ఏదో క్రొత్త వికాసం కనుపించి, తననేమో పరాయి వ్యక్తిగా భావించబడుతున్నట్లు అనుకొంది.

"బావా! నీవు సరిగా మాట్లాడవేం" అందీ సారి నిర్వేదంతో.

'ఏమని'

"ఇదివరకటిలాగా నువ్వు మాట్లాట్టంలేదు. యేదో చెప్పగూడనివి దాచుకొంటున్నావ్. మనస్సు విప్పి మాట్లాడటంలేదు" అని బేలమొగంతో అంది.

"అటువంటివి మాట్లాడిన రోజులు చాలా మంచివి. యిప్పుడవేమీ పనికిరావు."

రాంచరణ్ సమాధానాలు అనూరాధకు తికమకగా కనిపించాయి. తాను యేమని చెబుదామని వచ్చిందో అది మరిచిపోయింది. యిప్పుడు రాంచరణ్‌ని అర్థం చేసుకుంటానికి తన తెలివితేటలు చాలినట్లు కనిపించలేదు. ఎందుకు మనిషి యిలా మారిపోవలసివచ్చిందో తోచలేదు.

తను వ్యక్తిగతంగా యేమీ బావకు కష్టంకలిగించలేదు. అమ్మ - నాన్నతో యిష్టంలేక మాట్లాడకపోతే తనతో యెందుకు మాట్లాడగూడదు? ఇలా ఆలోచిస్తూండగా చేతిలో శుభలేఖ జారి క్రిందపడింది.

చరణ్ అది కనిపెట్టి, "అనూ! ఏమిటది?" అన్నాడు.

"బావా! ఇది శుభలేఖ" అంటూ కుడిచేత్తో అందించింది.

అందుకొని - విప్పి - బంగారు పూతాక్షరాల్ని చదివాడు. వ్రాస్తూన్న తెల్లకాగితాలమీద టపీ టపీమని కన్నీటి బిందువులు రాలాయి. అనూరాధ అప్రయత్నంగా పాదాలమీద మోకరిల్లుతూ—

"బావా! నన్ను దీవించవూ" అని గద్గదికంతో అంది.

చరణ్ ఆమె బుజాలు పుచ్చుకొని లేవనెత్తుతూ.

"అనూ! దీవించమంటావా"—

"నువ్వు పెళ్ళికి తప్పకుండా రావాలి."

సమాధానం నిశ్శబ్దంగా వుండిపోయింది.

పమిటచెంగుతో చెక్కిళ్లు తుడుచుకొంటూ—

"వెల్తున్నా బావా!"

చరణ్ నెమ్మదిగా అడుగులో అడుగువేస్తూ అల్మరా దగ్గరకుపోయి తలుపుతీసి అందులోంచి ఒక పొట్లంతీసి—

"అనూ! యిదే నా ప్రియమైన కానుక, నీ కింతకన్నా తగినటువంటిది యెలా యివ్వగలను. ఇది, శాశక్తి రాత్రింబగళ్లు వెచ్చిస్తే సంపాదింపబడినది. తీసికో అనూ! యెప్పుడైనా మీ యింటికొస్తే జ్ఞాపకముంచుకొంటావ్‌గదూ! అమ్మకు నాన్నకు నా నమస్కారాలని చెప్పు" అని అంటూంటే చటర్జీగారి మల్లెపందిర దాటుకొంటూ సన్నజాజి పూపొదరింటిలోంచి అనూరాధ వీధిగేటుదాటి వెళ్ళిపోయింది. రాంచరణ్ గేటుముందు నిలబడి వెళ్ళిన దిక్కువంక నిశ్చల నిరాశానేత్రుడయి ఆ వెన్నెల్లో చూస్తూ వుండిపోయాడు, అలాగే ఒక్క పది నిమిషాలు.